మూడు వార్డులకే రూ.2 కోట్లా?

- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల మండిపాటు
- టేబుల్ అజెండా చూపకపోవడంపై అభ్యంతరం
- రూ.కోటి పనులకు లభించని కౌన్సిల్ ఆమోదం


నిధుల కేటాయింపుపై కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం అర్బన్: మున్సిపాలిటీలోని శివారు కాలనీల అభివృద్ధికి మంజూరైన రూ.2 కోట్లను మూడు వార్డులకే కేటాయిస్తే ఎలాగని మున్సిపల్ వైస్ చైర్మన్ జయరామిరెడ్డి, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పహల్గాంలో ఉగ్రదాడికి బలైన వారి మృతికి సంతాపంగా మౌనం పాటించారు. రూ.1కోటికి సంబంధించిన టేబుల్ అజెండా పత్రాలు కౌన్సిలర్లకు ఇవ్వకుండా కౌన్సిల్ సమావేశం ముగిశాక కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు రాసుకోవడం సరికాదని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మితోపాటు కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన కమిషనర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం శివారు కాలనీల అభివృద్ధి కోసం రూ.3 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం కేతిరెడ్డి కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లోరూ.2 కోట్లతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తామని, మిగిలిన రూ.1 కోటిని మిగతా వార్డుల్లో వెచ్చిస్తామన్నారు. అయితే టేబుల్ అజెండాలో పొందుపరిచిన రూ.1 కోటి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలపదని చైర్‌పర్సన్ తేల్చిచెప్పారు.

శ్మశాన వాటికకు రోడ్డు ఏర్పాటు చేయాలి

మల్లేనిపల్లి వద్ద హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.80 లక్షలు కేటాయించారని శ్మశానానికి వెళ్లేందుకు రోడ్డు నిర్మించాలని కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తంరెడ్డి తెలిపారు. లక్ష్మీచెన్నకేశవపురం, జగనన్న కాలనీ, కేతిరెడ్డి కాలనీ ప్రజలు ఎవరైనా చనిపోతే మల్లేనిపల్లి శ్మశాన వాటికకు తీసుకురావాలంటే చాలా దూరమవుతుందని, లక్ష్మీచెన్నకేశవపురంలో ఏదైనా రిజర్వు స్థలం కేటాయించాలని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. సాయిబాబా ఆలయం నుంచి లక్ష్మీచెన్నకేశవపురం వరకు వీధిలైట్లు వెలగడంలేదని కౌన్సిలర్లు గోరకాటి పురుషోత్తంరెడ్డి, మేడాపురం వెంకటేష్ తెలియజేశారు. ఎకరా పొలానికి కంచె వేసినా రూ.2 లక్షలు కాదని, ఇక్కడ మున్సిపల్ స్థలం అర్ధ ఎకరా ఉన్నా రూ.3 లక్షలకుపైగా ఎలా కేటాయిస్తారని కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి ప్రశ్నించారు. అలాగే మంత్రి సత్యకుమార్ మొక్కలు నాటినప్పుడు ఎన్ని ఉన్నాయి, ప్రస్తుతం ఎన్ని ఉన్నాయో ఒకసారి పరిశీలించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షేక్ షంషాద్‌బేగం, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ప్రజాప్రతినిధుల మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమణారెడ్డి

నల్లచెరువు: అధికారులు గ్రామాల్లో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలకు తమకు కనీస సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారంటూ ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రమణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచులు గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా ఎంపీపీ రమణారెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమయపాలన పాటించడం లేదని వారి అలసత్వం వల్ల సచివాలయ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని మండిపడ్డారు. గ్రామాల్లోని వెల్నెస్ సెంటర్లలో సిబ్బంది అంబాటులో లేకపోవడంతో గ్రామాల్లో 104 వైద్యసేవలు కూడా ప్రజలకు సక్రమంగా అందడం లేదని వైద్య,ఆరోగ్య శాఖ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు అందుకున్న అల్లుగుండు కార్యదర్శి విజయ్, నల్లచెరువు సచివాలయం–1 కార్యదర్శి నరేష్‌ను ఎంపీపీ సన్మానించారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ వేతనాల్లో కోతపై కూలీల నిరసన


అధికారులకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

ఎన్‌పీకుంట: ఉపాధి హామీ వేతనాల్లో కోత విధించడంపై కూలీలు బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మండల కేంద్రం సమీపంలోని దేవరచెరువులో పూడికతీత పనులు చేశామని, వేతనం తక్కువగా రావడంతో మస్టర్లను పరిశీలించామన్నారు. ఇందులో పనులు చేయనివారికి కూడా బిల్లులు పెట్టడంతో పనులు చేసిన వారికి వేతనం తక్కువగా వచ్చిందని ఈఓపీఆర్డీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేశారు. స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ వేతనదారుల పట్ల పరుష పదజాలంతో ‘మీరు పనులు చేస్తే చేయండి లేదంటే మానుకోండి’ అంటూ మాట్లాడటం కలకలం రేపింది. అనంతరం ఈఓపీఆర్డీ మాట్లాడుతూ మస్టర్లను పరిశీలించి పనులు చేసిన కూలీలకు మాత్రమే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేతనదారుల పట్ల అమర్యాదగా ప్రవర్తించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను మందలించామని తెలిపారు. బిల్లుల చెల్లింపులలో అవకతవకలు జరిగి ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆర్డీటీ సంస్థను కాపాడాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజలు

ముదిగుబ్బ: ఆర్డీటీ సంస్థను కాపాడాలని కోరుతూ బుధవారం మండలంలోని పలు గ్రామాల ప్రజలు మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. వీరికి సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీటీ కార్యలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతు ఆర్డీటీ 56 ఏళ్లుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయాలని కోరారు. ఆర్డీటీ ఏటియల్ కృష్ణయ్య, సీపీఐ నాయకులు తిప్పయ్య, రమేష్, ఆదినారాయణ, కోటప్ప తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో బుధవారం సీఐటీయూ, యూటీఎఫ్, జేవీవీ, ఎస్ఎఫ్ఐ, రైతు సంఘం, చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రెన్యూవల్ కావడంతో సంస్థ సేవలో ఆగిపోయి వేలాది మంది ఉద్యోగులతో పాటు పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల కన్వీనర్ జేవి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, సీఐటీయూ నాయకులు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, హైదర్‌వలి, జేవీవీ నాయకులు సత్యన్న, లోకేష్, చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బాబు, ముకుంద, లక్ష్మి ఓబులేసు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర నేత డాక్టర్ ఆదిశేషు

బత్తలపల్లి: ఆర్డీటీ సంస్థ కోసం చేయి చేయి కలుపుదామని పలు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. బత్తలపల్లిలో 10వేల మందితో సేవ్ ఆర్డీటి నినాదంతో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, వాల్మీకి సంఘం రాయలసీమ ఇన్‌చార్జ్ బోయ సాంబశివ, దండోరా సాకే లక్ష్మన్న, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు సామాల రమేష్, ఎస్సీ జన సంఘం రాష్ట్ర ఇన్‌చార్జ్ సాకే రాంప్రసాద్, బీఎస్పీ ధర్మవరం ఇన్‌చార్జ్ సాకే వినయ్‌కుమార్, ఎస్టీ సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి


మాట్లాడుతున్న ఎంపీపీ వైవీ కౌసల్య

తనకల్లు: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వైవీ కౌసల్య అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పని చేసి తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అవసరమైన చోట కొత్త బోర్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. మల్లిరెడ్డిపల్లి వద్ద సోలార్ కోసం ప్రభుత్వ భూములు అప్పగించే ప్రతిపాదనలను అధికారులు విరమించుకోవాలని కోరారు. ఎంపీడీఓ రెడ్డెప్ప, ఏఓ శ్రీహరినాయక్, ఎంఈఓ కళ్యాణీ, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవమ్మ, జయమ్మ, ఇరిగేషన్ ఏఈ బయప్ప తదితరులు పాల్గొన్నారు.

నాట్య కళాకారులకు బహుమతులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీ లలిత నాట్య కళానికేతన్‌లో నాట్య గురువులు బాబు బాలాజీ, కమల బాలాజీ, రామలాలిత్య ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన అంతర్జాతీయ నాట్య దినోత్సవాల్లో నాట్య కళాకారులకు ఎస్‌బీఐ మేనేజర్ నందీప్, డాక్టర్ వివేక్, పట్టణ ప్రముఖులు మెటికల కుళ్లాయప్ప బహుమతులు అందించారు. అనంతరం నాట్య గురువులను శాలువాలతో సన్మానించారు.

శాంతి ర్యాలీ

పుట్టపర్తి టౌన్: పహల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ బుక్కపట్నం మండలం నార్శింపల్లి తాండాలో బుధవారం సర్పంచ్ సుధాకర్‌నాయక్ కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేపట్టారు. మృతులకు నివాళులర్పించారు.

కేసు నమోదు

కదిరి అర్బన్: కాళసముద్రంలో బుధవారం వివాహితపై దాడి జరిగింది. గ్రామానికి చెందిన శ్యామలమ్మను ఆమె భర్త లక్ష్మీనారాయణతోపాటు అతడి బంధువులు అంజనమ్మ,గంగన్న, ఆంజనేయులు దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రోడ్డు పరిశీలన


రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి అర్బన్: కదిరి–హిందూపురం రహదారి విస్తరణలో రోడ్డు కోల్పోయిన కందికుంట కాలనీని బుధవారం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పరిశీలించారు. మూడు నెలల క్రితం రహదారి విస్తరణలో కాలనీకి వెళ్లే దారిని తొలగించారు. దీంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్వరం సర్వీసు రోడ్డును ఏర్పాటు చేయాలని పలువురు కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డున పరిశీలించిన ఎమ్మెల్యే రోడ్డు కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సత్వరం రోడ్డు వేయిస్తానని కాలనీవాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు

బత్తలపల్లి: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దని తహసీల్దార్ స్వర్ణలత, ఎస్ఐ సోమశేఖర్ పేర్కొన్నారు. బుధవారం అప్పరాచెరువు ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్‌డే కార్యక్రమంలో భాగంగా ప్రజల ప్రాథమిక హక్కులపై పౌరహక్కుల దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించారు. వీఆర్‌ఓ నరసింహులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి

పుట్టపర్తి టౌన్: కరవుకు నిలయమైన ఉమ్మడి జిల్లాలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రాయలసీమ దళిత సేన జిల్లా అధ్యక్షుడు మంగళమడక శంకర్ పేర్కొన్నారు. పట్టణంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాక ఎంతో మంది యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ముదిగుబ్బ, పుట్టపర్తి మండలాధ్యక్షులుగా నరసింహులు, ఉత్తప్ప, పుట్టపర్తి, ఓడీచెరువు, బుక్కపట్నం, నల్లమాడ ఉపాధ్యక్షులుగా సాయికుమార్, రామచంద్ర, నాగభూషణ, ఓంప్రకాశ్‌ను ఎంపిక చేశారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి


కస్సముద్రం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ మునెప్ప

అమడగూరు: ప్రభుత్వం ఆదేశించే ప్రతి సర్వేను సచివాలయ సిబ్బంది సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ మునెప్ప పేర్కొన్నారు. బుధవారం ఆయన కస్సముద్రం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ముందుగా సచివాలయంలోని హాజరుపట్టిక, బయోమెట్రిక్ అటెండెన్స్‌ను పరిశీలించారు. ఉదయం, సాయంత్రం కచ్చితంగా బయోమెట్రిక్‌ను వినియోగించాల్సిందేనని సిబ్బందిని ఆదేశించారు. గత ప్రభుత్వం అధికారులకు ఇచ్చిన బయోమెట్రిక్ డివైస్‌లను కూటమి ప్రభుత్వం బ్లాక్ చేయడంతో కొత్తగా సచివాలయ సిబ్బందికి డివైస్‌లను ఎంపీడీఓ పంపిణీ చేశారు. గురువారం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆదినారాయణ, కార్యదర్శి రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పాలిసెట్

ధర్మవరం అర్బన్: పట్టణంలో బుధవారం పాలిసెట్ ప్రవేశ పరీక్ష సజావుగా జరిగిందని పాలిసెట్ కోఆర్డినేటర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు. పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాల, కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మోడల్ స్కూల్, కొత్తపేట మున్సిపల్ బాలికల పాఠశాల, శ్రీనివాస డిగ్రీ కళాశాలల్లో జరిగిన పరీక్షకు 1930 మందిగాను 1705 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి


శ్రీరాములు దంపతులను సన్మానిస్తున్న పశువైద్యశాల అధికారులు

కదిరి: ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని పశువైద్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ శుభదాస్ అన్నారు. స్థానిక పశువైద్యశాల ఆఫీస్ సబార్డినేట్ రమావత్ శ్రీరాములు నాయక్ బుధవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. స్థానిక పశువైద్యశాల ఏడీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: గంగిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మైనోద్దీన్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్సీలో డీఈఓ కిష్టప్ప, ఎంఈఓ చెన్నక్రిష్ణ, ఉపాధ్యాయులు మైనోద్దీన్‌ను సత్కరించారు. అలాగేఉద్యోగ విరమణ చేసిన కదిరి ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ డిపో క్లర్క్ కృష్ణయ్యను నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ఏడీఏం హరిమోహన్, నేతలు బైరిసెట్టి, ఎన్‌వీ రమణ, రామకృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి మేజర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న నారాయణ స్వామి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అశోక్ నాయక్‌తోపాటు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలి


పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

గాండ్లపెంట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, ద్వారనాల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ జయంతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం ఆమె ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డితో కలిసి పోషణ్ పక్వాడా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వందేమాతరం టీం సేవలు అభినందనీయం


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ గోపి

తనకల్లు: మండలంలో వందేమాతరం టీం సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎస్ఐ గోపి అన్నారు. కొక్కంటిక్రాస్‌లో వందేమాతరం టీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను బుధవారం ఎస్ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతరం టీం సభ్యులు భవిష్యత్‌లోనూ మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రికి చేర్చడం ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కొండ్ల భాస్కర్, రవీంద్ర, కొండ్ల రమేష్, బాగేపల్లి చలపతి, సంకు వెంకటరమణ, శ్రీధర్, గోవిందు, వెంకవెంకట నర్సు, వందేమాతరం టీం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గౌరవ డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న గౌస్‌లాజమ్

కదిరి అర్బన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు, శ్రీసత్యసాయి జిల్లా ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ గౌస్ లాజమ్‌కు అమెరికన్ మెరిట్ కౌన్సిల్ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బుధవారం విశాఖపట్నంలోని పబ్లిక్ లైబ్రరీ సమావేశ మందిరంలో డా. హసీనా చేతుల మీదుగా ఈ అవార్డును ఆయన అందుకున్నారు. విద్యారంగం, సామాజిక కార్యక్రమాల్లో విశేష సేవలందించినందుకుగాను ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

తూతూ మంత్రంగా మండల మీట్

అమడగూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించారు. మంగళవారం జరగాల్సిన మండల మీట్ కోరం లేక బుధవారానికి వాయిదా వేశారు. అయితే నలుగురు ఎంపీటీసీలు హాజరు కాగా సగం శాఖల అధికారులు కూడా గైర్హాజరయ్యారు. సమావేశ నిర్వహణపై మండల ప్రజానీకం నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో సమస్యల పరిష్కార నిమిత్తం ప్రతి మూన్నెళ్లకో సారి మండల మీట్‌ను నిర్వహిస్తారు. అయితే ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కాకుండానే ఇలా మీటింగ్‌లు నిర్వహిస్తే ఏం ప్రయోజనమని పెదవి విరుస్తున్నారు.

మృత్యుంజయ హోమం


పూజలందుకుంటున్న గణేష హరిహర స్వామి

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని గణేష హరిహర ఆలయంలో బుధవారం సకల గణపతి, మృత్యుంజయ హోమం, వారాహి మాత హోమం, గణపతి పూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మశ్రీ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో వేదమూర్తులు రఘునాథశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని బ్రాహ్మణ ముత్తయిదువులకు వడిబియ్యం కార్యక్రమం కూడా నిర్వహించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న యోగా గురువు సుబ్బరాయుడు


కనగానపల్లి: పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు మేధోశక్తిని పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం కొనసాగింది. యోగా గురువు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. రోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యం, శారీరక దృఢత్వం పెంపొందుతుందని తెలిపారు. కోలన్న, జానపద నృత్య గీతాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సిబ్బంది సూచించారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు


చిన్నారులకు వ్యాక్సినేషన్ చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని తాడిమర్రి, పిన్నదరి, దాడితోట, కునుకుంట్ల, పెద్దకోట్ల, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లోని విలేజ్ క్లినిక్‌ల్లో బుధవారం వైద్య సిబ్బంది వైద్య సిబ్బంది చిన్నారులకు పెంటా, రోటా, హెపటైటిస్ బీ, జేసీఈ తదితర టీకాలను వేశారు. అలాగే చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై మహిళలకు అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎంలు కోమలి, కృష్ణమ్మ, సుగుణ, లక్ష్మీకాంతం, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: బాల్య వివాహాలను అరికడదామని సమత సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసులనాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం ఆలయ పూజారులు, ముస్లిం మత పెద్దలు, చర్చి పాస్టర్లతో కలిసి పాదర్స్‌లతో కలిసి బాల్య వివాహాలపై పోస్టర్ ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం 2030 కల్లా దేశంలో బాల్య వివాహాలు నిర్మూలించాలని లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు.

విశ్రాంత ఎస్ఐ కుటుంబానికి పరామర్శ


గోవిందప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విశ్రాంత ఎస్ఐ గోవిందప్ప కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు. పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లికి చెందిన గోవిందప్ప(65) ఇటీవల గోరంట్ల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. బుధవారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పార్టీ నాయకులతో కలిసి మృతుడి ఇంటికి వెళ్లి ఆయన భార్య కళావతికి ధైర్యం చెప్పి మీకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గోవిందప్ప రిటైర్డ్ అయిన తర్వాత స్థానిక ఓబులేసుని ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఉండి సేవలు అందించారు. నాయకులు నరసింహారెడ్డి, గంగాద్రి తదితరులు ఉన్నారు.

సంస్మరణ సభ


సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

కదిరి అర్బన్: స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రప్రసాద్, తలుపుల మండలాధ్యక్షుడు సునీల్‌కుమార్ సంస్మరణ సభ జరిగింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె ఉపాధ్యాయులతో కలిసి ఇంద్రప్రసాద్, సునీల్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘానికి ఇంద్రప్రసాద్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, రమణారెడ్డి, నాగిరెడ్డి,విశ్వనాథ్‌రెడ్డి, నారాయణ,రాధాక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న భక్తులు

నల్లచెరువు: దామవాండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేంకటేశ్వరస్వామి విగ్రహ పతిష్ట కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూజలు ,అభిషేకాలు, హోమాలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ స్వామి పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బీసీ నాయకులు దశరథ నాయుడు, రమణ, దొడ్డెప్ప, రాజప్ప, శ్రీనివాసులు, గోవిందు, కె.శ్రీనివాసులు, పూజారి వెంకటరమణ, ఆదినారాయణ, వెంకటరమణ,చంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో ‘బెస్ట్’కు అవార్డుల పంట



అవార్డులు పొందిన బెస్ట్ అధ్యాపకులు

పుట్టపర్తి అర్బన్: బెంగళూరు ఇండియన్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌లోని సతీష్‌ధావన్ ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ సదస్సు(ఐపీఆర్)లో గోరంట్ల సమీపంలో ఉన్న బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ అవార్డుల పంట పండింది. అత్యుత్తమ అధ్యాపక అవార్డు డాక్టర్ అశ్వని, ఉత్తమ ఎమర్జింగ్ ఎడ్యుకేటర్ అవార్డు నేత్ర, అకడమిక్ ఎక్సలెన్స్ ఇన్ పెడగాగి అవార్డు స్నేహ, అత్యుత్తమ యువ పరిశోధకులు సతీష్, ఆసిఫ్, అత్యుత్తమ అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డు డాక్టర్ వేణు, విద్యా నాయకత్వ అవార్డు డాక్టర్ శర్మ, విద్యకు ఉత్తమ సహకారి అవార్డు డాక్టర్ లావణ్య సొంతం చేసుకున్నట్లు డీన్ డైరెక్టర్ డాక్టర్ రాంగోపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నోవేషన్ విశ్వవిద్యాలయంలో విద్యా నైపుణ్యం, వినూత్న బోధన, ప్రభావవంతమైన పరిశోధన కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు చెప్పారు.